# ఫైలు దొరికింది!

**ఆ**ఫీసులో ఫైలంటే ఆషామాషీ కాదు. పెళ్లి అయిన ఆడదాని మెళ్లో వుండే తాళి అంత పవిత్రమైనది! గొప్పది! అండ్రస్టాండ్!! 'నొసలు చిట్లించి చిరు కోపం ప్రదర్శిస్తూ అరచినట్టు మాట్లాడేడు వామనరావ్.

పేరుకు వామనరావే అయినా మనిషి ఆరడుగుల ఎత్తు వత్తు మీసా[illegible] కంచు కంఠం వగైరా లక్షణాలున్నవాడు!

వయసు యాభై పై చిలుకు! ఓ గవర్నమెంట్ ఆఫీసులో సూపరింటెండెంట్ గిరీ వెలగ బెడుతున్న పెద్ద మనిషి!

సర్వీసు కమీషన్ పరీక్ష పాసై కొత్తగ పోస్టింగ్ ఇవ్వగా జాయినయ్యేందుకొచ్చిన రాంబాబుకి ఫైళ్ల గురించి చెప్తూ క్లాసు పీకాడు వామనరావ్.

'మైడియర్ రాంబాబూ! లిజన్. ఈ కంప్యూటర్ యుగంలోనూ ఫైళ్లకు గల విలువ ఈ షన్మాత్రమైనా తగ్గలేదు. తగ్గనుగాక తగ్గదు! కాబట్టి ఫైళ్లు మెయిన్ టెయిన్ చేయటంలో జాగ్రత్త శ్రద్ధ అవసరం! అండ్రస్టాండ్! అదిగో కన్పిస్తోందే... ఆ కాళీగ వున్న సిటే నీది! వెళ్లికూర్చో! ఆగాగు అటెండెన్స్ రిజిస్టర్లో బుల్లి సంతకం వకటి పడేసి వెళ్లు...'

పిల్లకాకి రాంబాబు వామనరావ్ వుండేలు దెబ్బకి చెదిరిపోయాడు. వెళ్లి సీట్లో కూర్చున్నాడన్న మాటేగాని ఏ పని ఎలా చేయాలో బోధపడలేదు.

'చూడు రాంబాబూ! రెండేళ్లుగా ఆసీటు ఖాళీగావుంది. వర్కంతా పెండింగులో వుంది. వచ్చిన టపా అంతా కట్టలు కట్టి బీరువాలో పెట్టివుంచాను. ముందుగా... నీ టేబులు మీద పేరుకు పోయిన దుమ్ము దులుపు. తర్వాత లూజుగావున పేపర్లన్నీ తేదీల వారిగ విభజించి... ఆయా ఫైళ్లకు సంబంధించిన పేపర్స్ జాగ్రత్తగ చదివి వాటిలో ఫైల్ చేయ్! గుమస్తా వుద్యోగం బ్రహ్మవిద్యేం కాదు. పోనూ పోనూ నీకే అర్థమౌతుంది...

వామన్‌రావ్ చెప్పిన సూచనల మేరకు పని ప్రారంభించాడు రాంబాబు.

అదొక జీర్ణావస్తలో వున్న బిల్డింగ్! అందులో మనకు స్వాంతంత్ర్యం వచ్చిన నాటి నుండి వున్న ఒక గవర్నమెంట్ ఆఫీసు!

జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి నుంచి స్వీపర్ వరకు ఓ పాతిక మంది ఆ కార్యాలయంలో పని చేస్తుంటారు. గోడల బెత్తి కలూడి పోయినా.. దుమ్ము ధూళి, బూజు చెత్త చెదారంతో సర్వ వేళల యందు కనువిందు చేస్తూ కళకళలాడు తుంటుంది

కార్యాలయం!

ఏటా కోట్లాది రూపాయల ఆదాయంగల డిపార్టుమెంటే అయినా స్వంత బిల్డింగ్ అంటూ ఇంత వరకూ లేకపోవటం విడ్డూరం!

జె.డి. గారు నెలకు ఇరవై అయిదు రోజులు కేటాయింపుల మీద వుంటారు. ఈయన గారి కున్నది బి.సి. నాటి జీపు. సంవత్సరానికి పాతిక వేలు రిపేర్ల కింద ఖర్చు అయినా పెడుతున్నారుగాని.. దాని స్థానే కొత్త వెహికిల్ కొనటానికి ఫండ్స్ లేవు! శాంక్షన్ లేదు!

ఆఫీసులో గోడగడియారం ఆగి పోయి అర్నెల్లయింది. బ్యాటరీలు కొనివేసే దిక్కు లేదు. అదేమంటే హెడాఫీసు అప్రూవల్ ఇవ్వలేదనేది ఓ కుంటి సాకు!

బిల్డింగ్ ముందున్న ఖాళీ స్థలంలో ఇనుపరాడ్ పైన జాతీయ జండా రెపరెపలాడుతూంటుంది. జండా తల్లకిందిలుగా ఎగరేసినా... చిరిగి పేలికలైనా ఎవరూ పట్టించుకోరు. పేపర్ వాళ్లు చూచి రాయగా రాయగా బండి కదిలి చలనం కలిగి ఎలాగైతేనేం ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవంనాడు కొత్త జండా కరెక్ట్‌గా ఎగురేశారు.

అక్కడ పని చేసే వారెవరికీ జాతీయగీతం అంటే ఎవరికీ బొత్తిగా తెలీదు.

★ ★ ★

రేపు మినిష్టర్ గారొస్తున్నారయ్యా తనిఖీకి! మనమంతా వేళకి రావాలి! సీట్లలో వుండాలి! సూపర్నెంట్ వామనరావ్ గుమస్తాలందరికీ పేరుపేరునా పిల్చి చెప్పాడు.

అందరూ వినయం పుట్టి పడేలా తలలు ఆడించారు.

'ఒరే ఫరూకూ!... నువ్వీ ఆఫీసు అటెండర్‌వి కదా!? ఏనాడైనా యూనిఫారంలో ఆఫీసుకు తగలడ్డావూ! రేపైనారా!... ఏం? రేపొక్కరోజుకీ కారాకిళ్లీ నమలటం ఆపరా బాబూ... నీకు పున్యమంటుందీ...'

'యస్సార్'అంటే నోట్లో బుగ్గనవున్న తమ్మ ఎక్కడ ఎదుటి వాడి ముఖాన పడుతుందోని తల వూపేడు అటెండర్ ఫరూక్.

'ఇదిగో పాపాయమ్మా!... నీయమ్మ కడుపుమాడ! నీకు బ్రహ్మ చెవుడు! పళ్లూడి కళ్లు కన్పించక నడుము వంగినా.. డిపార్ట్‌మెంట్ లెక్కలో నీకింకా పదేళ్ల సర్వీసుంది! ఎంత అదృష్టవంతురాలివే నువ్వు...' ఇక అరిచే ఓపిక లేక స్వీపర్ని సైగ చేసి దగ్గరకు పిలిచి ముకాభినయం చేసి పాపాయమ్మకు అర్థమయ్యేలా వివరించాడు వామనరావ్ ఆఫీసు శుభ్రంగా వుంచాలని.

పది రోజుల క్రితం కేంపునకెళ్లిన జె.డి. గారు జీపు దిగి లోపలికి వచ్చి తన

రూమ్‌లోకెళ్లటం చూచిన వామనరావ్ తన సీటులోంచి లేచి బాస గదిలోకెళ్లాడు.

'సార్ గుడ్ మార్నింగ్! - రేపు మన మంత్రిగారు ఇన్స్పెక్షన్‌కొస్తున్నట్టు ఫోన్ మేసేజ్ వచ్చింది సార్..' చెప్పాడు వామనరావ్.

'తెల్సు! నాకూ మేసేజ్ అందింది. అందుకే ప్రోగ్రామ్ కాన్సిల్ చేసుకుని తిరిగొచ్చాను. మీరంతా ఎలర్ట్‌గా వుండండి.. మిగతా విషయాలు నేను చూసుకుంటాను..

వామనరావ్ వెనుదిరిగి వెళ్లబోయాడు.

'ఇదిగో వామనరావ్! ... ఎండాకాలం వచ్చేసింది. నా ఎయిర్‌కూలర్ రిపేరు చేయించండీ...' ఛైర్లో వెనక్కువాలి అన్నాడు జె.డి.

'క్రితం ఏడాదే మనం శాంక్షన్ కోసం హెడాఫీస్‌కు ప్రపోజల్ పంపాము సార్. ఇంతవరకూ రాలేదు. అదే మంటే బడ్జెట్ ప్రోవిజన్ లేదన్నారు.

'కోట్ల కొద్దీ రెవెన్యూ ఆర్జించి పెడుతున్నా మనకు మినిమం ఫెసిలిటీస్ లేక పోవటం దారుణం! విసనికర్రన్నా కొని నా టేబుల్ మీద పడేయ్...'

'అట్లాగే సార్' అని వచ్చి తన సీట్లో కూర్చుండి పోయాడు వామనరావ్.

★ ★ ★

మినిస్టర్ గారి ఇన్స్పెక్షన్ వుందనేసి అంతా తొమ్మిది గంటలకే ఆఫీసుకొచ్చి ఎవరెవరి సీట్లో వారు కదల కుండా కూర్చున్నారు.

ఫరూక్ పాన్ వేసుకోక పోవటం మూలాన మనసంతా తిక్కగా వున్నట్టన్పిస్తోంది. కనీసం 'చాయ్' కోసమైనా ఎవరూ బైటికెళ్లకుండా మంత్రిగారు ఏ క్షణం లోనైనా రావచ్చనే భయ భక్తులతో తమ ఛైర్లోనే వుండి శ్రద్ధగా పని చేసుకుంటున్నారు. (చేస్తున్నట్టు నటిస్తున్నారు)

లంచ్ బాక్స్‌లు తెచ్చుకోనివారు భోజనం కోసం ఇంటికి వెళ్లి రావాలా వద్దానే సందిగ్ధావస్థలో పడ్డారు.

మల్లేష్ యు.డి.సి. వామనరావ్‌ని సమీపించి' సార్! ఇన్స్పెక్షన్ సమయంలో మినిస్టర్‌గారు ఆయనగారి బావమరిది టెండర్‌ఫైనలైజేషన్ కేసు అడుగుతారేమోనని భయంగా వుంది సార్..' మనసులో మాట చెప్పాడు.

'అవునయ్యోవ్! మరిచేపోయాను. అన్నట్టు... ఆఫైలుఏమైందీ?-' బుర్రగోక్కుంటూ ప్రశ్నించాడు వామనరావ్.

'మనం హెడాఫీసుకి పంపి నెలరోజులైంది. మళ్లీ తిరిగి మనకు రాలేదు. అంటే... బహుశా అప్రూవల్ కోసం సచివాలయంలో చీఫ్ సెక్రటరీగారి వద్దకు పోయిందేమో

సార్... తనకు తోచింది చెప్పాడు మల్లేష్.

'సరే నువ్వెళ్లి... అన్ని చోట్లా వాకబు చేసి మన ఫైలు ఎక్కడుందో! ఏ పొజిషన్లో వుందో వెంటనే కనుక్కురా! వెళ్లు... ఇదిగో నీ టూవీలర్ మీద వెళ్లి ఇక్కడున్నట్టు రావాలి సుమా..' తొందర చేశాడు సూపర్నెంట్ వామనరావ్.

అనుకోకుండా మినిస్టర్‌గారు ఢిల్లీ వెళ్లాల్సి రావటంతో ఆఫీసు ఇన్స్పెక్షన్ కేన్సిలైంది.

మంత్రిగారు రానందుకు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మల్లేష్ రావటం చూచి 'ఏమైందయ్యా?' ఫైల్ లొకేట్ అయిందా! ఎక్కడుంది! అసలు పొజిషనేంటి..'గడగడా క్వశ్చన్ చేశాడు.

మనం పంపిన ఫైలు ఎక్కడా లేదుసార్. ఎక్కడో మిస్సై వుంటుందని చెప్పుకోవటం సెక్రటరియేట్ లో పి.ఏ. ద్వారా తెల్సుకున్నాను.

'కొంప మునిగింది! మంత్రిగారి ఇన్టరెస్టెడ్ కేసయ్యా అది. కనపడలేదంటే ఆయన మనల్ని చీల్చి చెండాడతాడు. ఫైల్ రెస్పాన్సిబిలిటీ నీదే... నీకు సస్పెన్షన్ తప్పదు!... అంతా ఖర్మ!-' చేత్తో విచారంగ తలపట్టుకున్నాడు వామనరావ్.

మల్లేష్ ఆకేసు డీలింగ్ క్లర్కు కావటంతో అతనిపై సస్పెన్షన్ వేటుపడింది.

అతని తప్పేం లేదంటూ స్టాఫంతా నల్ల బేడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు.

అభం శుభం ఎరుగని మల్లేష్‌ని ఫైల్ మిస్సింగ్ విషయంలో స్కేప్ గోట్‌ని చేసినందుకు యూనియన్ ఇంటర్ ఫియరై ఆఫీసర్స్‌తో చర్చలు జరిపింది!

చర్చలు ఫెయిల్ అయినందున యూనియన్ ఈ ఇష్యూని ప్రిస్టేజీగా తీసుకుని సమ్మె నోటీసు ఇచ్చింది.

★ ★ ★

మిట్ట మధ్యాహ్నం...

ఓ ఆగంతకుడు ఆఫీసులోకి ఎంటరైనాడు.

సూపర్నెంట్ వామనరావ్ రాసుకుంటున్న వాడల్లా తలెత్తి చూశాడు. వచ్చిన వ్యక్తి ఎవరో? ఎందుకొచ్చాడో అర్థం కాలేదు.

'సార్.. చాలా దూరం నుండి వచ్చాను. మీరు పర్మిషన్ ఇస్తే ఛైర్లో కూర్చుంటాను..' ఆగంతకుడు అడిగాడు.

తలూపి 'బైఠో! అబ్ బోలో మేటర్ క్యాహై'

'దాహంగావుంది. కాసిని మంచినీళ్లు ఇప్పిస్తారా?

'ఒరే ఫరూక్... పానీ లావ్!' కేకేశాడు.

గ్లాసెడు నీళ్లు గటగట తాగేసి సూపర్నెంట్ ముఖంలోకి చూపిస్తూ 'అబ్బ! మీ ఆఫీసు కనుక్కోవటానికి చాలా తిప్పలు పడ్డాను సార్' అన్నాడు.

'ఇంతకు మీరెవరు? ఏంపనిమీద వచ్చారు?'' సీరియస్‌గా అతని ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు వామనరావ్.

'నాపేరు యాదగిరిసార్! పాత పేపర్లు హోల్ సేల్‌గ రిటెయిల్‌గ కొనే వ్యాపారం నాది. నా షాపు మీ డిపార్ట్‌మెంట్ మంత్రి గారి ఇంటి దగ్గరే!..'

'సోది ఆపి... పాయింట్‌కి రా?!' నొసలు చిట్లించాడు.

వెంట తెచ్చుకున్న గుడ్డ సంచిలోంచి ఫైలు బైటికి తీసి 'ఇది మీ ఆఫీసు ఫైలే అయివుంటుందని అనుకున్నాను సార్..' అంటూ అందించాడు.

ఆఫైలు అందుకని తిరగా బోర్లా చూచి' బతుకు జీవుడా మిస్సైందనుకున్న ఫైల్ ఆ దేవుడి దయవలన దొరికింది. మనసులో గొణుక్కుని అందరి దేవుళ్లకూ మనసులో నమస్కరించి' ఇది.. అదే.. ఈ ఫైలు మీ చేతికెలా వచ్చింది?-'

మంత్రిగారి అంటెండరు అమ్మకానికి తెచ్చిన పాత న్యూస్ పేపర్స్‌లో ఈ ఫైలు కూడా వుండటం చూచి దీన్ని పక్కన పెట్టి చదివాను. నేను బి.ఏ. పాసైన వాడిని కాబట్టి ఈ ఫైలు మీ డిపార్ట్‌మెంట్‌ది. మీ ఆఫీసుదీ అయివుంటుందని గ్రహించి.. దీని కోసం మీరెన్ని బాధలు పడుతున్నారోని దీన్ని తీసుకుని మీ ఆఫీసు వెతుక్కుంటూ వచ్చాను...' గడగడా పాఠం వప్పగించిన స్టూడెంట్‌లా చెప్పాడు యాదగిరి.

'థాంక్యూ వేరీ మచ్! మీ సహాయం ఎన్నటికీ మరువలేనిది. సమయానికి దేవుడిలా వచ్చి ఫైలు తెచ్చి మా కిచ్చి ఓ అమాయకుడి ఉద్యోగం కాపాడి పుణ్యం కట్టుకున్నారు యాదగిరిగారూ..' కృతజ్ఞతలు తెల్పుకుని చాయ్ తెప్పించి ఇచ్చి యాదగిరిని సగౌరవంగా సాగనంపాడు వామనరావ్.

మిస్సైన ఫైలు దొరికిందనే విషయం అన్ని ఆఫీసులకీ పాకిపోయింది.

జె.డి.గారు ఫైలు చంకన పెట్టుకుని పరమానందంతో డైరెక్టరేట్ కెళ్లి పెద్దసారు వారిని కలిసి ఇరువరూ సచివాలయానికి కెళ్లి అక్కడ చీఫ్ సెక్రటరీని కల్సి ఆయన్ను బ్రీఫ్ చేసి ముగ్గురూ ఏకమై మినిస్టర్ ఛేంబర్ వైపు నడిచారు.

పోయిందనుకున్న ఫైలు దొరికినందుకు ముగ్గురు అధికారుల ముఖాల్లో ఆనందం పరవళ్లు తొక్కుతోంది. అందులోనూ టెండర్ ఫైలాయె? మంత్రి బావమరిది గారికి చెందినదాయె? -

'సార్ కాస్సేపు వెయిట్ చేయండి. లోపల మంత్రిగారు ఫోన్లో బిజీగా వున్నారు. పి.ఏ. చెప్పటంతో డోర్ వద్దే నిలబడిన ముగ్గురూ బజర్ విన్పించటంతో మినిస్టర్ ఛేంబర్లోకి దూరి నమస్కరించారు.

'మరేంలేదు సార్! తమరికో శుభవార్త చెప్పాలని వచ్చాం..' ముక్త కంఠంతో చెప్పారు.

'ఏందయ్యా! నన్ను స్టేట్ నుండి సెంట్రల్‌కి రమ్మని ఢిల్లీ నుండి వార్తేమైనా వచ్చిందా? '- నవ్వేరు మంత్రిగారు.

'అది కాదుసార్! పోయిందనుకున్న టెండర్ ఫైలు దొరికింది! ఇదేసార్ అది. ' చూపబోయారు.

'వారె..వారె..వారె..! ఇదంటయ్యా సంగతి! ఇందుకోసం ముగ్గురూ లగెత్తుకొచ్చారా? బోడిఫైలు పోతే ఎంత వుంటేఎంత మీకు తలకాయల్లేవుగాని.. అడ్ని అదే ఆ గుమస్తా గాడిని సస్పెండ్ చేయ్యకుండా మరో ఫైలు తయారు చేసి వుంటే.. యూనియన్‌తో మనకు తలనొప్పి వుండేది కాదు కదయ్యా.. మెత్త మెత్తగ ముగ్గుర్నీ మాటల్తో వడ్డించాడు మంత్రిగారు.

బిత్తర బోయిన అధికారుల ముఖాలు మాడి పోయిన అట్ల పెనంలా నల్లగా అయినయ్. క్షణం క్రితం వరకు వారిలో వున్న వుత్సాహం చప్ప చల్లారింది.

'పోయిందట!... దొరికిందట! అదేం వెయ్యి రూపాయలనోట్ల కట్టంటయ్యా పోయిందని బాధ పడటానికి? - ఆ ఫ్టాల్ ఫైలు! పెదపెద్ద డామ్‌లు 'ఫై ఓవర్లే' కూలి పోతుండయ్. ఫైలు మిస్సైతే వచ్చే నష్టమేంది? - సావు కబురు సల్లగ చెప్పొచ్చారుగానీ.. వెళ్లండి!... వెళ్లి పని చూచుకోండి....'

ఇకిలించుకుంటూ ముగ్గురూ బైటికొచ్చారు. జరిగిన ఇన్సల్ట్‌కి ముగ్గురూ బాధపడ్డారు. ఫైలు గురించి హేళన చేస్తూ మంత్రి గారు మాట్లాడటం నచ్చలేదు అధికారులు ముగ్గురికీ!

'ఫైళ్ల' ప్రాముఖ్యతేమిటో మంత్రిగారికేం తెల్సు? గాడిదకేం తెలుసు గంధం వాసన అన్న రీతిలో అనుకుని మనసును దిటవు చేసుకుని ఎవరిదోవన వారు తలొంచుకు విడిపోయారు.

వెడుతున్న ఆఫీసర్లను చూస్తూ పి.ఏ. పకపకా నవ్వాడు. ఆఫీసర్లకు మంత్రిగారు కోప్పడినందుకు బాధన్పించకపోయినా.. పి.ఏ. నవ్వినందుకు నొచ్చుకున్నారు. (మొగుడు కొట్టినందుక్కాదు... తోడి కోడలు నవ్వినందుకన్నట్టు!!)

-: సమాప్తం :-